కాని నన్ను ప్రేమించే గ్రుడ్డిది ఇప్పటి కెక్కడా పుట్టివున్నట్టు కాపడదు. మళ్ళీ మాబాబు గ్రుడ్డోడు. మా అమ్మ గ్రుడ్డిది. ఆళ్ళిద్దరూ తనువులు చాలించేశారు. ఈ గుడ్డివాళ్ళను మమ్మల్నిద్దర్నీ విడిపోకుండా వుండండంటూ లోకానికి వొప్పజెప్పి వెళ్ళిపోయినారు బాబులూ ?" అన్నాడు.

భావనాచార్యులు "అయితే మీ భావుమఱదికి కళ్ళు కనబడతాయి ?" అని ఆశ్చర్యపోయినాడు.

అంధు డంటాడు "కనబడ్డంలోనూ ! సరాయి మగవాడెవరన్నా భార్యవంకచూస్తే పుచ్చెగరేసేస్తాను !" అనేటంత ఋాం మా భావుమఱదిఋాం" అన్నాడు.

భావనాచార్యులు మరొక్కనిమిష మక్కడ నిలబడితే వొట్టు !

.... .... .... .... ....

## నిరుత్తరుని పెళ్లి !

"వెంకట్రాజు, వీర్రాజు, బుచ్చిరాజు"

ఈలాంటి పేర్లకుమల్లే, విరాట్రాజు అనే పేరు కలియుగ ప్పేరుగా దోచదు. అది కేవలం ద్వాపర యుగ సంబోధనంగా వుండిపోయి భారతం చదువుతూంటే వినరావడమేగాని, వేరేవరుసను. కీర్తిమోసినట్టు నాకెక్కడా పొడగట్టదు.

చూడొస్తే విరాట్రాజు విగ్రహం గొప్ప విగ్రహంగాను దర్జావంతంగాను ధర్మరాజులుంగారంత ఘనంగాను తోలుబొమ్మల తెరమీద తేటగా కానవస్తుంది.

మరేంచేత పెట్టుకోరో ఈ కలియుగంలో మానవులు ఆ మహారాజు పేరు ? అయినా పిలిచి చూస్తాను కథలోగానీ ఏమైనా పలుకుతుందేమో !

" విరాట్రాజుగారూ ! విరాట్రాజుగారూ !"

" ఓయి ఎందుకు పిల్చారు నన్ను ?"—

మరి పచ్చివెలక్కాల గొంతుక పడ్డట్టయింది. " ఎందుకు పిల్చానురా దేవుడా ?" యని అనుకుంటూ ధైర్యం తెచ్చుకుని— " అయ్యా ! తమకు కుమాళ్ళు వున్నారా ?" యని అడిగాను.

" లేకేం ? లేకలేక కలిగిన వొాఖ్కడూ లక్షమందిలా సలక్షణంగా వున్నాడు " అన్నాడు అతి గర్వంగా.

" అయితే వాని పేరు ?"

" నిరుత్తరుడండీ !" అన్నాడు.

" ఏమండీ ! తమ పేరు విరాట్రాజుగారై యున్నప్పుడు మీ అబ్బాయిగారి పేరు ఉత్తరుడని పెట్టక నిరుత్తరుడని పెట్టారేం ?" యని అడిగాను.

" మాట్లాడితే అందరు ఉత్తరకుమారప్రజ్ఞ లనిపోతారు. ఉత్త చవటైపోతాడేమోనని నిరుత్తర నామధేయునిగా జేశాను" అని నిదానంగా జవాబు చెప్పాడు ఆ వ్యక్తి.

ఒక్కపట్టాను పకాల్న నవ్వుతూ—" మూగవాడు కాదు గదా కొంపతీసి !" అన్నాను.

" కాదులేండి ! వాడికి ఎంతో అవగాహనవుంది. ఆవులిస్తే పేగులు లెక్కెడుతాడు ! అష్టవర్షాదపి !" అన్నాడు.

" బుద్ధిమంతుడేనా ?"

" ఆఁ ! మగపిల్లవాడు కాబట్టి అష్టవర్షాలున్నా అష్టాదశ వర్షాలున్నా బుద్ధిగానే వుంటాడు. చూడండీ ! అయినా ఇంత

తికమకగా నన్నెందుకు ప్రశ్నిస్తున్నారో బోధపడకుండావుంది. మీవద్ద ఏమైనా కన్యవుందా ?" అన్నారు విరాట్రాజుగారు నావంక అట్టే చూస్తూ.

" నావద్ద కన్యాలేదు గిన్యాలేదు ! అన్యాపేక్ష లేకుండానే మిమ్మల్ని ఆహ్వానించాను. అయితే మీవాడు ' నార్మ ' లేనా?" అన్నాను.

" ఆ ! శుద్ధ నార్మల్ ! డచ్చాలు కొట్టనే కొట్టడు. అసలు ' నార్మల్ ' అన్న పదమైనా ఈ రోజున నేర్పాను. వానికి, ఇదివఱకు అదికూడా తెలీదు. అంత నిరుద్రేకుడు. రోజూ తన ఉష్ణం కొలుచుకుంటూ వుండవలసిందని చెప్పి ఒక థెర్మామీటరు, దాని మర్మమంతా చాల భాగం చెప్పి, నార్మలంటే ఇదిరా యని ఆ దాని నల్లని V లాంటి సంకేతాన్ని చూపించాను. తండ్రి కుమారునియెడల చూపించవలసిన బాధ్యతంతా చూపించాను నేటి వుదయం ! ఇప్పుడే చూపించి ఇలా వీధిలోకి వచ్చాను ! ఎబ్ నార్మలవితే వాడి ఖర్మం " అన్నాడు.

అంటే నేను చిరునవు నవ్వాను.

విరాట్రాజు వెంటనే—" ఏమండోయి ! మీనవ్వు పరాసికపు నవ్వుగానూ తోచడంలేదు. పరకాయింపు నవ్వుగానూ తోచడంలేదు. మీవద్ద పెళ్ళికాని అమ్మాయివుంటే మాఅబ్బాయికి చేసుకోవలెనని నాకు ఘట్టిగావుంది అభిప్రాయం. మీరు ఒక పర్యాయం మాయింటికి దయచేసి మాపిల్లవాణ్ణి చూచుకోవచ్చును. వానిలో ఎట్టి ఎబ్నార్మాలిటీస్ లేవు !" అన్నాడు.

విరాట్రాజుగార్కి వెంటనే నాకృతజ్ఞతా పూర్వక వందనాలుచెప్పి అంతసేపు నించోబెట్టినందుకు క్షమించమంటూ సెలవు పుచ్చుకున్నాను.

ఆయన్ను నేను అంతగా ఎందుకు మన్నించవలసి వచ్చిందో పాఠకు లీసరికి గ్రహించేవుంటారు. నాదగ్గఱ వొక్క-మూడేళ్ళ ఆడపిల్లవుంది. ఎప్పటికైనా విరాట్రాజుగారు మాకు మగపెళ్ళివారు అయ్యే అవకాశంవుంది. మరిన్నీ విరాట్రాజు గారు! అందుచేత ఆయన అన్నివిధాలా మన్నింపబడవలసిన పెద్దమనిషిగా తోచారు!

మామూడేళ్ళ ఆడపిల్ల కొంతకాలానికి ఇరవై మూడేళ్ళొచ్చి, ఎల్. ఐ. ఎమ్. లేడీ డాక్టరు అయింది. ప్రైవేట్ ప్రాక్టీసు పెట్టింది. పెళ్ళాడనంటూ వచ్చింది ఎవర్నీని.

“పోనీ నిరుత్తరుడుగార్ని ఓతూరి చూసిరా! అమ్మాయీ!” యని కోరాను.

కోరిన వేళావిశేషం ఎలాంటిదో-వెళ్ళింది! కాదనకుండా!

వెళ్ళీవెళ్ళడంలోనే చూసిందట. నిరుత్తరుడుగారు ఇంకా ఆ యీడునకూడా ఉష్ణం కొలకాచ ఊచ అస్తమానం నోట బెట్టుకు నార్మల్ గమనించుకుంటూ స్తబ్ధుగా వుండడం, పరుండి వుండడంన్నూ.

వెడుతూనే ఆ థెర్మామీటరు తీసివేసి నేలనేసి కొట్టిందట! మాఅమ్మాయి.

ఉలిక్కి-పడిలేచి యువకుడు నేలమీద చిందులు త్రొక్కే-పాదరసం పలుకుల్ని పలికించాట్ట! “ఇది గంతులేస్తూందే? ఏమిటి చిత్రంగా వుంది!” అని అడిగాట్ట.

“ఇది పాదరసం! గాజుగొట్టంలో కణికగా వున్నంత సేపూ—మంచంమీద మనిషి కాళ్లు ముడిచి సాచుకునే పొసిషన్ తప్ప మరో పొసిషన్ చూపించదు. బద్దలకొట్టి ఇవతల

పడేశామా ఇల్లంతా గంతులేస్తుంది ! అసలు ఇది స్ట్రెయిట్ లైన్‌కోలమ్‌గాదు ” అని చూపించిందిట.

“ మరి మానాన్న దీన్ని పాదరసంగా వర్ణించేదేలేదు. దీని కింత గంతూ వింతా వుంటేను !” అంటూ వంగివున్న నిరుత్తరుడు, గెంతి వురికినట్టుగా మంచంమీదినుంచి కిందికి వురికి——

“ నేలను పాదరసం - నీలోను సరసం. ”

అంటూ పాడుతూ మా ఎల్. ఐ. ఎమ్. లేడీ డాక్టరమ్మాయిని అమాంతంగా ప్రేమించి వూరుకున్నాట్ట ! వానిలోని ఆ ‘ ఎబ్ నార్మలిటీ ’ వల్ల ఈమె తత్వంకూడా వెంటనే మారిపోయిందట.

మరి వ్రాయడానికేముంది ? విరాట్రాజుగారి కోరిక నెరవేరింది. నాపాచిక పారింది,

.... .... .... .... ....

## సారీలో బడ్డాడు గార్డు

తెనుగువాళ్ళకు ఇతరభాషలు అబ్బవు కాని, ఇతరులకు తెనుగుభాష సుళువుగా యబ్బేటట్టు కనబడుతుంది.

అయినా తెనుగువాళ్ళు పక్కా తెనుగు మాట్లాడ్డంగాని వ్రాయడంగాని యరుదు. ఏదో ఇతరభాషల సాంకర్యం వుండక తప్పదు.

* * * * *

వానికి “ ట్రేడ్‌లో బలే నేక్ ” వుంది యన్నాడు బస్సులో కూర్చుని వొక కోమటి.